నలుగురు మావోయిస్టులు అరెస్టు

పోలీసులు అరెస్టుచేసిన మావోయిస్టులు

చర్ల, ఫిబ్రవరి 7: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల పోలీసులు శుక్రవారం నలుగురు మావోయిస్టులను అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చర్ల పోలీసులు, 141 బెటాలియన్ సిబ్బంది తాలిపేరు ప్రాజెక్టు సమీపంలో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా బీజాపూర్ జిల్లా పోలంపల్లి గ్రామానికి చెందిన గట్టుపల్లి ఊర, సుక్మా జిల్లా చింతలనార్‌కు చెందిన మడకం ఉంగ, దంతెవాడ జిల్లా అలనార్ గ్రామానికి చెందిన కణితి లక్కే, సుక్మా జిల్లాకు చెందిన సోడి సుక్కె అనుమానస్పదంగా ఉండడంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. వీరంతా మావోయయిస్టు పార్టీకి చెందినవారిగా దర్యాప్తులో వెల్లడైంది. వారిని అరెస్టు చేసినట్టు చర్ల సీఐ రాజువర్మ తెలిపారు.

నేడు విరాట్ విష్ణుసహస్రనామ పారాయణం

ఏర్పాట్లను పరిశీలిస్తున్న దేవనాద జీయర్‌స్వామి

భద్రాచలం, ఫిబ్రవరి 7: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో చినజీయర్‌స్వామి పర్యవేక్షణలో వికాస తరంగిణి, జీయర్‌మఠం ఆధ్వర్యంలో శనివారం విరాట్ విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను శుక్రవారం సాయంత్రం దేవనాద జీయర్‌స్వామి, వికాస తరంగిణి సభ్యులు పరిశీలించారు. దేవనాద జీయర్‌స్వామి విలేకరులతో మాట్లాడుతూ కార్యక్రమంలో 25 వేల మంది భక్తులు పాల్గొంటారనే అంచనాతో ఏర్పాట్లు చేస్తున్నామని, భక్తులు, వేద పండితులు, వైదిక సిబ్బంది, ప్రజల కోసం ప్రత్యేక గ్యాలరీలను సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు. శనివారం ఉదయం తొలుత రామాలయం నుంచి శోభ యాత్ర ప్రారంభమవుతుందని అంబేద్కర్ సెంటరు మీదుగా క్రీడామైదానం వద్దకు చేరుకుంటుందని తెలిపారు. అదేవిధంగా విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం సాయంత్రం చినజీయర్‌స్వామి భక్తులతో పారాయణ నిర్వహిస్తారని, అనంతరం విష్ణు సహస్రనామ పారాయణ పుస్తకాలను భక్తులకు ఉచితంగా అందజేస్తారన్నారు. ఏర్పాట్లను దేవనాద జీయర్‌స్వామి, గట్టు వెంకటాచార్య, ఎన్‌సీహెచ్ చక్రవర్తి, గాదె మాధవరెడ్డి పరిశీలించారు.

నవగ్రహ సుబ్రహ్మణ్య, దుర్గాదేవి ధ్వజస్తంభ ప్రతిష్ఠ

పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే మెచ్చా

దమ్మపేట, ఫిబ్రవరి 7: మండలంలోని పట్వారిగూడెం గ్రామంలో గురువారం విరాట్ విశ్వకర్మ భగవానుడు, నవగ్రహ సుబ్రహ్మణ్య దుర్గావి ధ్వజస్తంభ ప్రతిష్ఠ శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు మెచ్చా నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు పాల్గొని ధ్వజస్తంభం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారిని ఆలయకమిటీ సభ్యులు సత్కరించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు యుగంధర్, అంకత ఉమ మహాశ్వరరావు, మాజీ సర్పంచ్ రూప్‌సింగ్, చక్రధర్, చంద్రశేఖర్‌రావు, రెడ్డిమళ్ళ నాగయ్య, యట్ల వెంకమ్మ, నాగేంద్ర, తట్టుకోళ్ల సత్తిబాబు పాల్గొన్నారు.

'బ్రైట్‌మైండ్స్'లో కమ్యూనిటీ హెల్పర్స్ కార్యక్రమం

మణుగూరు టౌన్, ఫిబ్రవరి 7: పట్టణంలోని సుందరయ్యనగర్‌లో ఉన్న బ్రైట్ మైండ్స్ ప్లే స్కూల్ కమ్యూనిటీ హెల్పర్స్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ కమిషనర్ ప్రసాద్, వందపడకల ఆస్పత్రి సూపరింటెండెంట్ సునీల్ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన, మెరుగైన సమాజ నిర్మాణంలో ప్రతీ విభాగం పని చేసే ప్రతీ వ్యక్తి అత్యవసరమే అని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం రాంబాబు, రమ, గ్రీష్మ, ప్రముఖులు కవిత, శ్యాం, వినోద్‌కుమార్, నరేశ్, మధు, రైతు జగన్నాథం, నర్సు సుమలత, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రత్యేక పాఠశాలకు స్థలం గుర్తింపు

అశ్వారావుపేట, ఫిబ్రవరి 7: కొండరెడ్ల విద్యార్థులకు ప్రత్యేక పాఠశాల నిర్మాణానికి మండలంలోని పాత రెడ్డిగూడెం గ్రామంలో ప్రభుత్వ భూమిని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, ఐటీడీఏ డీఈ బాపనయ్య, ఎంఈవో సోయం ప్రసాదరావు శుక్రవారం గుర్తించారు. కొండరెడ్ల కుటుంబాలతో సమావేశమై వారి అభిప్రయాలను సేకరించారు. కొండరెడ్ల విద్యార్థులకు ప్రత్యేక పాఠశాలతో పాటు హాస్టల్ ఏర్పాటు చేస్తామన్నారు. పౌష్టికాహారం, నాణ్యమైన విద్య అందించనున్నట్లు చెప్పారు. ఐటీడీఏ ఏఈ ప్రసాద్, పంచాయితీ కార్యదర్శి సబిత పాల్గొన్నారు.

10న నులి పురుగుల నివారణ దినోత్సవం

అశ్వారావుపేట, ఫిబ్రవరి 7: మండలవ్యాప్తంగా ఈ నెల 10న జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని వైద్యులు విజయవంతం చేయాలని ఎంపీడీవో అశోక్ కోరారు. 19 ఏళ్ల లోపు పిల్లందరికీ మాత్రలు అందించాలన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం వైద్యులతో ఆయన సమావేశమయ్యారు. మండలంలోని అన్ని గ్రామాల్లో మొత్తం 4,276 మంది పిల్లలను గుర్తించినట్లు పీహెచ్‌సీ డాక్టర్ కనకం తనూజ తెలిపారు. రెండేళ్ల లోపు పిల్లలకు సగం మాత్ర, 3–19 ఏళ్ల పిల్లలకు ఒక మాత్ర వేయాల్సి ఉంటుందన్నారు. అల్పాహారం తీసుకున్న పిల్లలకు మాత్రమే ఈ మాత్రలు ఇస్తామన్నారు. గిర్దావర్ అక్బర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాణి పాల్గొన్నారు.

కాసాని ఐలయ్యకు నివాళి

జూలూరుపాడు, ఫిబ్రవరి 7: ఇటీవల మృతిచెందిన సీపీఎం నేత కాసాని ఐలయ్య సంస్మరణ సభ శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగింది. చిత్రపటం వద్ద పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు యాసా నరేష్, నాయకులు గార్లపాటి వెంకటి, గడిదేశి కనకరత్నం, తాటి పద్మ, పద్దం సుగుణ, బానోత్ ఈశ్వర్, అభిమిత్ర, బొల్లి లక్ష్మయ్య నివాళులర్పించారు.

ఆరుగ్యారెంటీలు అమలు చేయాలి

చర్ల, ఫిబ్రవరి 7: ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఆరుగ్యారంటీలు అమలు చేస్తామని హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత దాని ఊసే ఎత్తడం లేదని, హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ (ఎంఎల్ న్యూడెమోక్రసీ) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఆవునూరి మధు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రేవంత్ సర్కార్ అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచినా ఇప్పటివరకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని దుయ్యబట్టారు. రైతుల సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ఈనెల 20 చలో హైదరాబాద్ పిలుపునిచ్చిందని మధు పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.

బాలుడి మర్మాంగాన్ని కొరికిన పెంపుడు కుక్క

భద్రాచలం, ఫిబ్రవరి 8: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కుంట సమీపంలోని వంజలవాయి గ్రామానికి చెందిన వెట్టి లక్ష్మయ్య అనే ఏడేళ్ల బాలుడి మర్మాంగాన్ని వారి పెంపుడు కుక్క శుక్రవారం కరిచింది. దీంతో సదరు బాలుడిని అతడి తల్లిదండ్రులు వెంటనే భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తీసుకొచ్చారు. వైద్యులు ఆ బాలుడికి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఆ బాలుడి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

భద్రాచలం ఆసుపత్రి ఘటనపై కలెక్టర్ సీరియస్

- విచారణకు ఆదేశం.. విచారణాధికారిగా బూర్గంపహాడ్ ఆసుపత్రి సూపరింటెండెంట్
- ఆసుపత్రిలో, బాధితురాలి గ్రామంలో విచారణ
- నేడు కలెక్టర్‌కు అందనున్న నివేదిక

సిబ్బందితో మాట్లాడుతున్న పీవో రాహుల్

భద్రాచలం, ఫిబ్రవరి 7: ప్రసవం కోసం వచ్చిన గర్భిణి పట్ల భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వైద్యులు అమానుషంగా ప్రవర్తించిన తీరు పట్ల, అలాగే ఆమెను అక్కడి సిబ్బంది లంచాలు అడిగిన విషయం పట్ల భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ సీరియస్ అయ్యారు. ఇదే విషయంపై 'ప్రైవేటులో నొప్పి రాదా? ప్రభుత్వాసుపత్రిలోనే నొప్పొస్తుందా?' శీర్షికన శుక్రవారం 'నమస్తే తెలంగాణ' ప్రచురించిన కథనానికి ఆయన స్పందించారు. ఈ ఘటనపై విచారణకు ఆదేశించారు. బూర్గంపహాడ్ ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ ముక్కంటేశ్వరరావును విచారణాధికారిగా నియమించారు. కాగా, కలెక్టర్ ఆదేశాల మేరకు ఒక కమిటీ బృందం సభ్యులు భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రిలోనూ, మరో కమిటీ సభ్యులు బాధితురాలి గ్రామంలోనూ శుక్రవారం విచారణ చేపట్టారు. అయితే, ఈ విచారణ నివేదికను శనివారం కలెక్టర్‌కు సమర్పించనున్నట్లు ముక్కంటేశ్వరరావు 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు.

రోగులతో మర్యాదపూర్వకంగా మెలగాలి

భద్రాచలం, ఫిబ్రవరి 7: ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులతో మర్యాదపూర్వకంగా మెలగాలని, వారి నుంచి డబ్బులు ఆశించకుండా వైద్య సేవలు అందించాలని ఐటీడీఏ పీవో బి.రాహుల్ ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. 'ప్రైవేటు'లో నొప్పిరాదా, ప్రభుత్వాసుపత్రిలోనే నొప్పొస్తుందా' అనే శీర్షికన నమస్తే తెలంగాణ దినపత్రికలో శుక్రవారం వార్త ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన పీవో రాహుల్ భద్రాచలం ఏరియా ఆసుపత్రిని తనిఖీ చేశారు. వైద్యులు, సిబ్బంది పీవో ప్రత్యేకంగా మాట్లాడారు. ల్యాబ్ టెస్టులు ఉచితంగా చేయాలని, గర్భిణులు కాన్పు కోసం ఆసుపత్రికి వస్తే తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయాలని ఆదేశించారు. మందుల కొనుగోలు కోసం చిట్టీలు బయటకు రాయొద్దని, అన్ని మందులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. సాధారణ ప్రసవాలు పెంచేందుకు ప్రయత్నించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో చైతన్య, ఆసుపత్రి పర్యవేక్షకులు రామకృష్ణ, ఆర్ఎంవో సంతోశ్‌కుమార్, ఆయుష్ వైద్యులు వెంకటేశ్వరరావు, వైద్యులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలి: ఐటీడీఏ పీవో రాహుల్

బూర్గంపహాడ్, ఫిబ్రవరి 7: మారుమూల ప్రాంత పీహెచ్‌సీల్లో పని చేసే వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని భద్రాచలం ఐటీడీఏ పీవో బీ. రాహుల్ అన్నారు. మండలంలోని మోరంపల్లిబంజర పీహెచ్‌సీని ఆయన శుక్రవారం సందర్శించారు. వైద్యశాలలో ఓపీ, డెలివరీ, మందులకు సంబంధించిన రికార్డులను పరిశీలించి రోగులకు అందిస్తున్న వైద్య సేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. పీవో రాహుల్ మాట్లాడుతూ వైరల్ జ్వరాలు ప్రబలే అవకాశం ఉన్నందున వైద్య సిబ్బంది సమయపాలన పాటించి ఆసుపత్రికి వచ్చే రోగులకుసరైన వైద్య సేవలందించాలన్నారు. రోగ నిర్ధారణ కోసం ప్రైవేటు ల్యాబ్‌లకు రిఫర్ చేయవద్దని, రోగుల పట్ల సిబ్బంది ఎవరైనా దురుసుగా ప్రవరిపస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వైద్యాలలో సాధారణ ప్రసవాల సంఖ్య ను పెంచాలని, ఆసుపత్రిలో పాముకాటు, కుక్కకాటు, ఇతర జబ్బులకు సంబంధించిన మందులు కొనుగోలు కోసం ఎవరిని పంపకూడదన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చైతన్య, పీహెచ్‌సీ డాక్టర్లు సాహితి, మధుబాల, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

టేకులపల్లి, ఫిబ్రవరి 7: మండలవ్యాప్తంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈలు హెచ్.దేవ, పి.బుజ్జి కన్నయ్య ఒక ప్రకటనలో తెలిపారు. టేకులపల్లి, బొమ్మనపల్లి సబ్ స్టేషన్లలో ఉదయం 9.00 నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

'ఆసరా' పెంచాలని వినతి

చంద్రుగొండ, ఫిబ్రవరి 7: ఆసరా పింఛన్లను పెంచుతామన్న కాంగ్రెస్ పార్టీ హామీని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని కోరుతూ గిరిజన విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి మూడ్ బాలాజీనాయక్ శుక్రవారం ఎంపీడీవో అశోక్‌కు వినతిపత్రం ఇచ్చారు. నాయకుడు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లపై సమీక్ష

కొత్తగూడెం అర్బన్, ఫిబ్రవరి 7: పన్నుల వసూళ్లు, నీటి సరఫరాపై కొత్తగూడెం మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేకాధికారి, అడిషనల్ కలెక్టర్ విద్యాచందన శుక్రవారం సంబంధిత అధికారులతో సమీక్షించారు. మున్సిపల్ కమిషనర్, మేనేజర్, రెవెన్యూ ఆఫీసర్, డీఈ, ఆర్ఐలు, ఏఈ, బిల్ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

రామవరం, ఫిబ్రవరి 7: సింగరేణి కొత్తగూడెం ఏరియాలోని సత్తుపల్లిలో వివిధ అభివృద్ధి పనులకు జీఎం శాలెంరాజు శుక్రవారం శంకుస్థాపన చేశారు. సత్తుపల్లి ఏరియాలోని అర్బన్ పార్కులోకి వీధి కుక్కలు రాకుండా ఫెన్సింగ్‌కు శంకుస్థాపన చేశారు. జేవీఆర్ ఓసీలో డంపర్, డోజర్ వాహనాల బ్యాటరీ చార్జింగ్ రూమ్ ప్రారంభించారు. డిస్పెన్సరీలో నూతన డిజిటల్ ఎక్స్‌రే మిషన్‌ను ప్రారంభించారు. ఏఐటీయూసీ బ్రాంచి సెక్రటరీ సముద్రాల సుధాకర్, ఐఎన్‌టీయూసీ నాయకుడు ఎండీ రజాక్, అధికారులు స్నేహలత, ఎన్‌వీఆర్ ప్రహ్లాద్, రామకృష్ణ, నరసింహారావు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ తోలకాలను నిలిపివేయాలి

కరకగూడెం, ఫిబ్రవరి 7: రాత్రి, పగలు అని తేడా లేకుండా పెద్దవాగు నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుక తోలకాలను వెంటనే నిలిపివేయాలని సీపీఎం మండల కన్వీనర్ కొమరం కాంతారావు అధికారులకు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా కొందరు వ్యాపారులు ఇష్టారీతినా ఇసుకను పెద్దవాగు నుంచి తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమ ఇసుక తోలకాలు జరుగుతున్నా అధికారులు కన్నెతి చూడకపోవడం పలు అనుమానులకు తావిస్తుందన్నారు. ఇసుక అక్రమ తోలకాలపై ఉన్నాతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఇసుక తోలకాలను నిలిపివేసి పంచాయతీల్లో ఇసుక కూపన్ల విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

'చలో హైదరాబాద్'కు వెళ్దాం రండి

టేకులపల్లి, ఫిబ్రవరి 7: కార్మిక సమస్యల పరిష్కారానికి ఈ నెల 20న 'చలో హైదరాబాద్'ను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు డి.ప్రసాద్ తమ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆయన శుక్రవారం టేకులపల్లిలో ఐఎఫ్‌టీయూ సమావేశంలో మాట్లాడుతూ.. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం అమలు చేయాలన్న డిమాండుతో ఈ నెల 20న 'చలో హైదరాబాద్' నిర్వహించనున్నట్లు చెప్పారు. దీనిని కార్మికులంతా జయప్రదం చేయాలని కోరారు.

సర్పంచ్ అభ్యర్థిని హత్య చేసిన మావోయిస్టులు

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దంతెవాడ జిల్లాలో ఘటన

కొత్తగూడెం ప్రగతి మైదాన్, ఫిబ్రవరి 7 : పోలీస్ ఇన్ఫార్మర్ నెపంతో కాంగ్రెస్ పార్టీకి చెందిన సర్పంచ్ అభ్యర్థిని మావోయిస్టులు హత్య చేసిన ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దంతెవాడ జిల్లాలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పోలీస్ ఇన్ఫార్మర్‌గా వ్యవహరిస్తున్నాడని ఆరోపిస్తూ దంతెవాడ జిల్లా అర్నపూల్ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి జోగా బర్సె ఇంట్లోకి సాయుధులైన మావోయిస్టులు గురువారం రాత్రి గొడ్డలితో ఇంటి తలుపులు పగులగొట్టి లోనికి ప్రవేశించి కుటుంబ సభ్యుల ఎదుటే గొంతుకోసి హత్య చేసినట్లు తెలుస్తోంది. తర్వాత అక్కడి నుంచి అడవిలోకి పారిపోయినట్లు సమాచారం. ఇప్పటికే దంతెవాడ, బీజాపూర్ జిల్లాల్లో నాలుగు రోజుల్లో మావోయిస్టులు నలుగురిని గొంతుకోసి హత్య చేశారు. జోగా ఈ ప్రాంతంలో బలమైన గిరిజన నాయకుడని, 25 ఏళ్లుగా ఈ ప్రాంత రాజకీయాల్లో చురుగ్గా పనిచేస్తున్నాడని స్థానికులు పేర్కొన్నారు. జోగా ఇంతకుముందు సీపీఐ పార్టీలో పనిచేసినా కొన్నేళ్ల క్రితమే కాంగ్రెస్ పార్టీలో చేరాడు. 2000 సంవత్సరం నుంచి ఇప్పటివరకు అర్నపూర్‌లో జోగా దంపతులు ఇద్దరూ సర్పంచ్‌లుగా పనిచేశారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల సందర్శన

అశ్వారావుపేట రూరల్, ఫిబ్రవరి 7: మండలంలోని మల్లాయిగూడెం, దిబ్బగూడెం, పండువారిగూడెం గ్రామాల్లోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను ఆంధ్రప్రదేశ్‌లోని పార్వతీపురం మాన్యం జిల్లా సీతంపేట, భామిని, వీరఘుటం మండల్లాలోని రైతులు శుక్రవారం సందర్శించారు. నాబార్డ్ సహకారంతో వాసన్ సంస్థ పర్యవేక్షణలో మల్లాయిగూడెం జీవ ప్రాజెక్టులో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. జమ్మి సూర్యకాంతం మునగ క్షేత్రంలో అంతర పంటల సాగుపై, ఘన జీవామృతం తయారీపై వాసన్ సీనియర్ ప్రోగ్రాం ఆఫీసర్ కె.సతీష్‌కుమార్, బీఆర్‌సీ గ్రూప్ లీడర్ కొర్రి మల్లయ్య, కో–ఆర్డినేటర్ వెంకటేశ్వరరావు, ఈఎఫ్‌ఆర్‌పీలు శ్రీనివాసరావు, చక్రపాణి అవగాహన కల్పించారు. జీవ వనరుల కేంద్రం(బీఆర్‌సీ) పనితీరు, కషాయాల తయారీ, గోమూత్రశాల నిర్మాణం, మూత్రం నిల్వలు, విక్రయం తదితరాంశాలను ఏపీ రైతులకు రైతులు మొడియం రాములమ్మ, దేశీ వరి(ఇంద్రాణి) సాగు రైతు సింగమ్మ వివరించారు. ఇంటెన్సివ్ ఫామ్‌లోని ఫారం పాండ్, చిక్కుడు, కాకర, నాటుకోళ్లు, గేదెలు, పశుగ్రాసం, చేపల పెంపకం తదితరాంశాలను రైతు సారిని సోమరాజు వివరించారు. వాసన్ సంస్థ ప్రతినిధి ఉదయ్ పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన బాలమేళా బృందం

విద్యార్థులను చదివిస్తున్న బాలమేళా బృందం సభ్యులు

మణుగూరు టౌన్, ఫిబ్రవరి 7: తరగతి గదుల్లో విద్యార్థులు సంపాదించిన జ్ఞానాన్ని, నైపుణ్యాలను పరిశీలించేందుకు విద్యాశాఖ ఆధ్వర్యంలో ఎఫ్ఎల్ఎన్ బాలమేళా పరిశీలన బృందం శుక్రవారం తోగ్గూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించింది. తరగతుల వారీగా విద్యార్థుల నైపుణ్యాలను అభ్యాసన, ప్రతిభ సృజనాత్మకత అంశాలను పరిశీలించారు. విద్యార్థులతో చదివించడం, రాయించడం, విభిన్న నేపద్యాల నుంచి అన్ని కోణాలలో అంశాలను అడిగి రాబట్టారు. తరగతుల వారీగా ఉత్తమ విద్యార్థులను ఎంపిక చేసి త్వరలో జరగబోయే కాంప్లెక్స్ మేళాకు విద్యార్థులను పంపే విధంగా తర్ఫీదు ఇచ్చి విద్యార్థులను తీసుకురావాలని టీచర్లకు సూచించారు. బాలమేళా బృందంలో మణుగూరు కాంప్లెక్స్ హెచ్ఎం నాగశ్రీ, కాంప్లెక్స్ అసిస్టెంట్ సెక్రటరీ కిశోర్, సీఆర్‌పీ లక్ష్మణ్, హెచ్ఎం దబ్బారి రామారావు, ఉపాధ్యాయులు సింగా రవిబాబు, తుర్రం శారద, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కుష్ఠు, క్షయ వ్యాధులపై అవగాహన

రామవరం, ఫిబ్రవరి 7: కుష్ఠు, క్షయ వ్యాధులపై స్థానిక గురుకుల పాఠశాలలో, నాగయ్యగడ్డలోని నేతాజీ ఉన్నత పాఠశాలలో, పంజాబ్‌గడ్డలోని పాఠశాలలో లెప్రసీ నోడల్ పర్సన్ వి.శ్రీనివాసరావు శుక్రవారం అవగాహన కల్పించారు. చర్మం మీద రాగి, ఎరుపు రంగులో స్పర్శ లేని మచ్చలు ఉంటే.. వ్యాధి ఉన్నట్లుగా అనుమానించవచ్చని చెప్పారు. ఇలాంటి స్పర్శ లేని మచ్చలు ఉన్నట్లయితే వైద్యుల వద్ద పరీక్ష చేయించుకోవాలని, మందులు వాడాలని చెప్పారు. రెండు వారాలకు మించి దగ్గు, తెమడ వస్తున్నా.. రాత్రిళ్లు చలి జ్వరం ఉన్నా.. బరువు తగ్గినా.. ఆకలి లేకపోయినా వెంటనే వైద్యులను సంప్రదించాలని కోరారు. ఏఎన్ఎంలు పద్మ, కవిత, తార, సుష్మిత, స్కూల్ స్టాఫ్ నర్స్ రమ్య, ఆశాలు రాజమణి, భవాని పాల్గొన్నారు.

క్షయ వ్యాధికి భయపడొద్దు

చర్ల, ఫిబ్రవరి 7: క్షయవ్యాధి సామాన్యమైనేదని ఎవరూ భయపడవద్దని కొయ్యూరు పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ శ్రీధర్ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టిన 100 రోజుల 'నిక్షయ్ షివిర్'లో భాగంగా శుక్రవారం లక్ష్మీకాలనీలో ఏర్పాటుచేసిన అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడారు. వారం రోజులకంటే ఎక్కువ రోజులు దగ్గు, జ్వరము, ఆయాసం వంటి లక్షణాలుంటే వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. క్షయ వ్యాధిపై ప్రతి ఒక్కరు అవగాహ కలిగి ఉండాలన్నారు. వ్యాధివస్తే భయపడొద్దని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా మందులు అందజేస్తారని అన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అటవీ రక్షణపై అవగాహన కల్పించాలి

టేకులపల్లి, ఫిబ్రవరి 7: అటవీ రక్షణపై గిరిజన ప్రాంతాల ప్రజలకు అధికారులు అవగాహన కల్పించాలని డీఎఫ్‌వో జి.కృష్ణగౌడ్ కోరారు. మండలంలోని బర్లగూడెం గ్రామంలో టేకులపల్లి ఎఫ్ఆర్‌వో ముక్తార్ హుస్సేన్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో డీఎఫ్‌వో మాట్లాడారు. అడవుల్లో వేసవిలో అగ్ని ప్రమాదాలు జరగకుండా చూడాలన్నారు. బర్లగూడెం గ్రామంలో అటవీ శాఖ గురువారం నిర్వహించిన వాలీబాల్ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఏసీఎఫ్ కోటేశ్వరరావు, ఎఫ్‌డీవో దామోదర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్ తనిఖీ

గోడౌన్ తనిఖీ చేస్తున్న కలెక్టర్

కొత్తగూడెం టౌన్, ఫిబ్రవరి 7: స్థానిక ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలోగల ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ జితేష్ వి పాటిల్ శుక్రవారం తనిఖీ చేశారు. ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాలతో ఈవీఎం గోడౌన్‌ను ప్రతి నెలా తనిఖీ చేస్తున్నట్లు చెప్పారు. ఈవీఎం, వీవీ ప్యాట్లు ఉన్న గదిని, సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. గోడౌన్ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని, అనుమతి లేనిదే ఎవరినీ లోనికి అనుమతించకూడదని అధికారులను ఆదేశించారు. తనిఖీ రిజిస్టర్‌లో సంతకం చేశారు.

ముత్యాలమ్మ జాతరను సందర్శించిన భద్రాద్రి రామాలయ ఈవో

పూజలు చేస్తున్న ఈవో రమాదేవి

దుమ్ముగూడెం, ఫిబ్రవరి 7: మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ముత్యాలమ్మ జాతరను భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి శుక్రవారం సందర్శించారు. ఆమెకు ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఈవో రమాదేవిని సన్మానించారు.

జాతరకు రావాలని రేగాకు ఆహ్వానం

రేగాను ఆహ్వానిస్తున్న ఆలయ కమిటీ మహిళా సభ్యులు

మణుగూరు టౌన్, ఫిబ్రవరి 7: మండలంలోని తోగ్గూడెం లో ఈ నెల 11 నుంచి 15వ తేదీ వరకు జరిగే శ్రీ సమ్మక్క సారలమ్మ సుంకు జాతరకు హాజరుకావాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావును ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బొగ్గం రజిత, ఆలయ కమిటీ సభ్యులు అడపాల సత్యవతి, గుడి పూజారమ్మ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేయాలి

కొత్తగూడెం గణేష్ టెంపుల్, ఫిబ్రవరి 7: జిల్లాలోని స్కానింగ్ సెంటర్లను వైద్యాధికారులు, సిబ్బంది ప్రతి నెలా తనిఖీ చేసి, ఫాం–10ఎఫ్ ఆడిట్ నిర్వహించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్‌నాయక్ ఆదేశించారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో శుక్రవారం పీసీపీఎన్‌డీటీ జిల్లా అడ్వైజరీ కమిటీ